

# పరుగు

"గుడ్‌మార్నింగ్ యంగ్ లేడీ!"

"గుడ్‌మార్నింగ్! నేనింకా యంగ్ లేడీలా కనిపిస్తున్నానా మీకు?" స్నిగ్ధంగా నవ్వింది డాక్టర్ శ్రుతి.

"మీరెంత పెద్దవాళ్ళయినా నువ్వూ, హరితా నాకు చిన్నపిల్లలానే కనిపిస్తారమ్మా!" పండిపోయిన జుట్టు, అలిసిపోయిన కళ్ళు, ఆర్ద్రంగా వున్న కంఠం... శ్రీపతిరావును చూస్తుంటే ఆయన రూపురేఖల్ని పుణికి పుచ్చుకున్న తన స్నేహితురాలు హరిత కళ్ళముందు నిలిచింది శ్రుతికి.

"హరిత ఫోన్ చేసింది. రిజర్వేషన్ దొరకలేదట. హైదరాబాద్ వరకు ఫ్లయిట్‌లో వచ్చి అక్కడనుండి ఎలాగోలా రేపు ఉదయానికి ఇక్కడకు చేరుకుంటానని చెప్పింది. మీకు వచ్చింది మైల్డ్ ఎటాకేనంటే నమ్మదే. బాగ్గా కోలుకుంటున్నారు. ప్రమాదమేమీ లేదని ఫిజీషియన్ చెప్పారని చెప్పాను. అయినా రెక్కలు కట్టుకుని మీ ముందు వాలాలని దాని ఆత్రుత."

"నిజమేనమ్మా! నాకూ అలాగేవుంది, ఎప్పుడు వస్తుందా అని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను" శ్రీపతిరావు కళ్ళు చెమ్మగిల్లాయి.

అవును, ఇన్నాళ్ళకు తను మనుషుల కోసం, ప్రేమకోసం, చల్లటి పలకరింపుకోసం మొహం వాచినట్లెదురు చూస్తున్నాడు.

"హరనాథ్‌గారు, హృషీకేశ్‌గారు, హసిత ఎక్కడున్నారు? వాళ్ల ఫోన్ నంబర్లు యివ్వండి. ఫోన్ చేస్తాను." శ్రీపతిరావు కళ్ళల్లో మేఘాలు కమ్ముకున్నాయి.

"ఎందుకమ్మా ఫోన్ చెయ్యడం!? వాళ్ళెలాగూ రారు. ఒకడు అమెరికాలో, ఒకడు జపాన్‌లో, హసిత జర్మనీలో ఉన్నారు. ముగ్గురూ ఆ దేశాలవాళ్ళనే పెళ్ళి చేసుకుని తరువాతెప్పుడో ఒక ఉత్తరం ముక్క రాసిపడేశారు... హరిత ఒక్కతే నా మనసు గ్రహించి నేను కుదిర్చిన సంబంధం చేసుకుని ఇండియాలో వుండిపోయింది. అదికూడా నామాట వినకుండా ఏ శ్రీలంకవాడ్నో చేసుకుని వుంటే ప్రపంచంలో నాలుగు దిక్కుల్నీ కలిపిన బిడ్డల్ని కన్న ఖ్యాతి దక్కేది నాకు" నవ్వాడాయన. ఆ నవ్వు వెనుక దాగివున్న విషాదాన్ని శ్రుతి పసిగట్టింది. ఆయన్ని కదిపి, అంతగా మాట్లాడేలా చేసినందుకు కించపడింది.

"మీరీ జ్యూస్‌తాగి రెస్ట్ తీసుకోండి. పేషంట్స్‌ని చూచి మళ్ళీ వస్తాను." ఆప్యాయంగా పళ్ళరసం తాగిస్తున్న శ్రుతిని చూస్తుంటే శ్రీపతిరావు కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగి గడిచిపోయిన జీవితం, మరుగుపడిపోయిన జ్ఞాపకాలు వెలికి వచ్చాయి.

నిరుపేద కుటుంబంలో పుట్టిన తనకు ఊహ తెలిసిన దగ్గర్నుండి డబ్బు లేకపోవడంలోని లోటు, డబ్బు లేనినాడు తప్పనిసరిగా దిగమింగాల్సిన అవమానాలు, ఆశాభంగాలు అనుక్షణం అనుభవంలోకి వచ్చాయి. అష్టకష్టాలు పడి, అన్నిటికీ తలవంచి చదువులో నెగ్గుకు వచ్చి

ఇంజనీరయ్యాడు. ఉద్యోగంలో చేరిన రోజున తన ముందున్న ఏకైక లక్ష్యం డబ్బు సంపాదించడం. తను కోరిన డబ్బు. తనను అవమానించిన వారిని పరిహసించగల స్థాయి తన ఉద్యోగంలో సంపాదించలేనని కొద్ది రోజుల్లోనే తెలిసొచ్చింది.

ఆలోచించి, ఆలోచించి చివరకు తెగించి ఉద్యోగం మానేసి కాంట్రాక్టు చెయ్యడం ప్రారంభించాడు. అప్పటినుండి యిప్పటి వరకు బ్రతుకంతా వొకటే పరుగు. ఇంకా ఇంకా పై శిఖరాలకు చేరుకోడానికి నిర్విరామమైన కృషి. ఒకసారి పరుగుపందెంలో పాల్గొవడం మొదలుపెట్టాక వెనుకపడిపోకూడదనే పట్టుదల. పరుగు, పరుగు, నిరంతరం పరుగు పెడుతూనే ఉన్నాడు. ఈ పోటీ నిషాలో పూర్తిగా కూరుకుపోయి బ్రతుకులో ఎన్నో మధురమైన అనుభూతుల్ని కోల్పోయానని, ఎన్నో విలువైన వాటిని చేజార్చుకున్నానని చాలా ఆల్యంగా గుర్తించాడు. అప్పటికే తను డబ్బుకు దగ్గరగా, మనుషులకు దూరంగా జరిగిపోయాడు. తను సంపాదించిన డబ్బు తన పిల్లల్ని ఉన్నత స్థాయిలోకి తీసుకొచ్చింది కాని వాళ్ళకూ తనకూ మధ్య దాటలేని అగాధాన్ని సృష్టించింది.

బ్రతుకులో తనేం కోల్పోయాడో తెలుసుకునే సరికి హరిత ఒక్కతే తన దగ్గర వుంది. ప్రయత్న పూర్వకంగా తను పూడ్చుకుంటూ వచ్చిన అగాధాన్ని హరిత సులభంగా దాటి వచ్చేసింది. పరుగు వేగాన్ని తగ్గించి హరితతోనూ, తన భార్యతోనూ తీరికగా కొన్ని సంతోష సమయాల్ని పంచుకుంటూన్నప్పుడు హరిత స్నేహితురాలు శ్రుతికూడా అప్పుడప్పుడూ తమతో చేరేది... ఆయన కళ్ళలోని తడిని గమనించి వెంటనే వెళ్ళిపోవడానికి మనసొప్పక అలాగే నిలబడిపోయింది శ్రుతి.

"నీకు చాలా శ్రమనిస్తున్నానమ్మా!' తెప్పరిల్లి శ్రుతివంక బాధపడుతున్నట్లుగా చూశాడు శ్రీపతిరావు.

"మీరలా అంటే నాకు చాలా బాధకలుగుతుంది. మీరు హరితకెంత ప్రియమైన వ్యక్తో, నాకూ అంతే. ఆ కాంట్రాక్టు పుణ్యమా అని పనిమీద మీరీ ఊరొచ్చారు. సడన్‌గా గుండెనొప్పి వచ్చి అనుకోకుండా ఇక్కడకు వచ్చారు కాబట్టి ఇన్నేళ్ళకు మిమ్మల్ని చూడగలిగాను... మీరు మరచిపోయినా, ఒక పేదపిల్లకు మీ కూతురితో పాటు ఆప్యాయతను పంచిన మీ ఔదార్యాన్ని నేను మరచిపోలేను" ఎమోషన్‌తో చలించింది శ్రుతి స్వరం. ఎప్పుడో నిస్వార్థంగా తను పంచిన రవ్వంత ప్రేమకు ప్రతిగా ఎంత ఆప్యాయతనూ ప్రేమనూ పొందుతున్నాడు తను!... సన్నజాజి పరిమళంలా సంతోషం అలముకుంది శ్రీపతిరావు గుండెల్నిండా.